మర్నాడు ప్రాతఃకాలానే నిద్రలేచి, కాలకృత్యాలు తీర్చుకుని గంగా నది ఒడ్డుకి చేరుకున్నాడు. తన గ్రామంలోని చిన్న చెరువు తప్ప అంతదాక ఇంత పెద్ద నదిని చూడలేదతను. ఎంతో పొడవు, మరెంతో విశాలంగా వున్న ఆ నదిలో 'హరహర గంగే' అని అరుస్తూ, వేలాదిమంది మనుషులు మునుగుతూ స్నానం చేస్తూ, ఆ కుష్ఠురోగికి కనబడ్డారు.

అతను కూడా ఉత్సాహంగా నీటి దగ్గరికి వెళ్ళాడు. ఏదో ఆలోచన రావడంతో కదలకుండా అక్కడే ఠక్కున ఆగిపోయాడు. ముందుకు ఒక్క అడుగు కూడా వేయలేకపోయాడు. ఓసారి స్నానంచేస్తున్న వేలాదిమంది మనుషుల వంక తేరిపార చూసాడు.

'అంతమంది ఎన్నెన్ని పాపాలు చేసుంటారో కదా! పాపం. అవన్నీ ఈ గంగమ్మ తల్లి స్వీకరించాల్సిందే కదా' అన్న ఆలోచన కలిగిందతనికి.

'నిత్యం వేలాదిమంది పాపాలని స్వీకరిస్తున్న గంగాదేవికి తన పాప భారం కూడా ఎందుకు యివ్వాలి' అనిపించిందతనికి. తను చేసిన పాపాన్ని తనే భరించడం న్యాయమనిపించింది. అంతే! గంగానదిలోకి దిగకుండా ఆమెకు నమస్కరించి వెనుతిరిగాడు.

అతను యింకో అడుగు వేసాడో లేదో, ఆశ్చర్యంగా అతడికున్న కుష్ఠువ్యాధి మొత్తం మాయమై, క్షణంలో పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు.

తన స్వార్థాన్ని చంపుకుని, గంగానదికి హాని చేయరాదన్న అతని ధార్మిక ఆలోచనా గంగే, ఆ నది మీద అతనికి కలిగిన అసాధారణ దయే అతణ్ణి ఆరోగ్యవంతుడ్ని చేసింది.

## 37. చీపురు

ఓ రాజుగారు అనేక సంవత్సరాలు అన్నిరకాల వ్యామోహాలతో భోగవంతమైన జీవితంలో మునిగి తేలాక, తను చేసిందంతా పాపం అని, అది తనని జంతు జన్మలకి తీసుకెళ్తుందని గ్రహించాడు.

దాంతో లక్ష్మోజీ అనే గురువుని ఆశ్రయించి తన పాపం ఎలాగైనా తొలగేలా చేయమని అర్థించాడు. ఆ సద్గురువు అతని వంక ప్రసన్నంగా చూసి చెప్పాడు.

"ఊరి చివర ఒంటిస్థంభం మేడ కట్టించి, అందులో నీ అందాల కూతుర్ని ఒంటరిగా వుంచు. రాత్రుళ్ళు వెళ్ళి అక్కడ పడుకుని వుదయం మళ్ళీ రాజమందిరానికి వస్తూండు. ఆరు వారాలయ్యాక కనబడు."

గురువు చెప్పినట్లే రాజు చేసాడు. ఇది ప్రజలందరికి తెలియడంతో చెవులు కొరుక్కోసాగారు. తన గురించి అంతా చెడ్డగా మాట్లాడుకోవటం రాజుగార్ని బాధించినా, గురువు మాటమీద గౌరవంతో రాజు మిన్నకున్నాడు. ఆరు వారాల గడిచాక రాజు గురువు దగ్గరికి వెళ్ళాడు.

"స్వామీ. మీరు చెప్పినట్లే చేసాను. నా పాపం పూర్తిగా శమించినట్లేనా?" అడిగాడు రాజు.

ఆయన రాజుని తేరిపార చూసి చెప్పాడు.

"నూటికి తొంభై తొమ్మిది పాళ్ళ పాపం శమించింది. నీకు, నీ కూతురికి అక్రమ సంబంధం అంటగట్టి, వదంతులు మాట్లాడుకుంటున్న వారంతా నీ పాపంలో భాగం పంచుకున్నారు. ఎందుకంటే, అందులో నిజంలేదు కాబట్టి. కాని యింకా ఓ పాలు భాగం మిగిలి వుంది."

"అది పోయేదెలా స్వామీ?" ప్రశ్నించాడు రాజు.

"నువ్వు వెంటనే రాజధాని శివార్లలో వున్న క్షురకుడి దగ్గరికి మారువేషంలో వెళ్ళి, ఈ దేశపు రాజు ఎలాంటివాడని అడుగు. అప్పుడు నీ పాపం పూర్తిగా పోయే అవకాశం ఉంది."

వెంటనే రాజు మారువేషంలో ఆ క్షురకుడి దగ్గరికి వెళ్ళాడు. అతను పని చేస్తూండగా అడిగాడు.

"ఏమయ్యా. ఈ రాజ్యం విశేషాలు ఏమిటి?"

"పెద్దగా ఏం లేవండి." జవాబు చెప్పాడా క్షురకుడు.

"అదేమిటి? ఊరంతా కోడై కూస్తూంటే నీకు తెలీకపోవడం ఏమిటి? మీ రాజుగారి ఏకైక కూతురు అందాల భరిణటగా? ఆమెతో ఆయన ఒంటిస్థంభం మేడలో రాత్రుళ్ళు గడుపుతున్నారటగా?"

"ఏమోనండి. నా కళ్ళతో చూడకుండా ఏం చెప్తానండి?"

"భలేవాడివే. లోకులనుకునేదేదో చెప్పచ్చుగా?"

"నేను అందరిలాంటివాణ్ణి కానండి. ఇతరుల విషయంలో నిజం తెలీకుండా నింద వేస్తే, వారి పాపాన్ని నా నాలిక అనే చీపురుతో కడిగి, దాన్ని నేను స్వీకరించిన వాణ్ణవుతాను. ఈ సంగతి నా సద్గురువు ఏనాడో నన్ను హెచ్చరించారు కాబట్టి నేను నాకు తెలీని విషయంలో ఏం మాట్లాడను."

"నీ సద్గురువు ఎవరు?" ఆశ్చర్యంగా అడిగాడు రాజు.

"మీ గురువుగారైన లక్ష్మోజీ అన్న రామోజీ." జవాబు చెప్పాడా క్షురకుడు.

## 38. ప్రకృతి చెప్పిన పాఠం

ఓ గ్రామంలో ఓ ధనికుడు ఉన్నాడు. పది తరాలు తినేంత ధనం సంపాయించినా, అతను ఖర్చుకి వెనకాడే పరమ లోభి. బియ్యం డబ్బాకి తాళంవేసి, యింట్లోనివారు ఎంతమందో లెక్కచూసి, అన్నం వండటానికి ఆ ప్రకారం తనే బియ్యం కొలిచి భార్యకి యిచ్చేవాడు.

ఓసారి ఆ వూరికి ఓ స్వాములవారు వచ్చారు. ఆయన చెప్పే పురాణ కాలక్షేపానికి ఆ ధనవంతుడు హాజరయ్యాడు. ఆఖరున అందరూ ఎవరికి తోచింది వారు స్వాములవారికి యిచ్చి వెళ్తూంటే ఈ సంపన్నుడు మాత్రం ఏమీ యివ్వకపోగా, ఆయనకి నమస్కరించి యిలా అడిగాడు.

"నాకు ప్రత్యేకంగా ఏదైనా బోధ చేయండి స్వామీ."

స్వాములవారు అతని వంక తేరిపార చూసి చెప్పారు.